పేటలో సిద్ధమవుతున్న ఊళ్లు

- నియోజకవర్గంలో 9,768 ఇళ్లు మంజూరు
- వేగంగా జగనన్న కాలనీల నిర్మాణం
- గృహ నిర్మాణంపై లబ్ధిదారుల్లో పెరుగుతున్న ఆసక్తి


పేట నియోజకవర్గంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజవర్గ పరిధిలో 97 లేఅవుట్లలో జగనన్న కాలనీల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 9,768 ఇళ్లు మంజూరు(రిజిస్టర్డ్ 8,443) కాగా వాటిలో ఇప్పటికే 2,168 పూర్తవగా, మిగిలిన గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు, సిమెంట్ మంజూరు చేస్తుండటంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి కనపరుస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న ఊళ్లు..

సాధారణంగా పది పదిహేను ఇళ్ల నిర్మాణం జరిగే వాటిని కాలనీలు అని పిలుస్తుంటారు. కానీ జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా కాలనీలు కాకుండా గ్రామాలు నిర్మాణం జరుగుతున్నాయి. ఒక్కో లేఅవుట్‌లో వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో లే అవుట్-1, లే అవుట్-2 లో, జగ్గయ్యపేట మండలం, పెనుగంచిప్రోలు మండలం, వత్సవాయి మండలం, పేట నియోజకవర్గానికి సంబంధించి నందిగామ మండల పరిధిలో ఉన్న ఏటిపట్టు గ్రామాల్లోని 103కు గాను 97 లేఅవుట్లలో(మిగిలినవి కోర్టు కేసుల్లో ఉన్నాయి) నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. వాటిలో పేట పట్టణంలోని లే అవుట్-1, లేఅవుట్-2 లో ఒకే చోట ఏకంగా 1,185 గృహాలకు 661 గృహాలు నిర్మాణం జరుగుతున్నాయి.

రాయితీతో నిర్మాణ సామగ్రి అందజేత..

ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం 3 శాతం వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణ సాయం చేస్తోంది. రుణాలు పొందేందుకు వీలుగా సిబిల్ స్కోరు నుంచి పేదలకు మినహాయింపు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.15 వేల విలువ చేసే 20 టన్నుల ఇసుకను లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. అదే విధంగా సబ్సిడీపై ఇనుము, సిమెంట్, ఇతర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. తద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.40 వేల మేర లబ్ధి చేకూరనుంది.
మొత్తంగా 12 రకాల వస్తువులను సబ్సిడీ కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

గృహాల మంజూరు ఇలా..	
మండలం	లబ్ధిదారులు
జగ్గయ్యపేట అర్బన్	1,172
జగ్గయ్యపేట రూరల్	2,463
పెనుగంచిప్రోలు	2,190
వత్సవాయి	2,678
నందిగామ మండలం	1,245

విప్ ఉదయభాను ప్రోత్సాహకాలు..

నవరత్నాల్లో పేదలందరికీ ఇల్లులో భాగంగా లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఇసుక రవాణా కోసం అయ్యే ఖర్చును తానే భరించి ఉచితంగా రవాణా చేస్తున్నారు. అలాగే గృహాలు పూర్తిచేసి ప్రవేశాలు చేసిన అందరు లబ్ధిదారులకు నూతన వస్త్రాలను బహూకరిస్తూ, త్వరగా పూర్తిచేసిన వారికి రూ.10 వేలు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

గృహ ప్రవేశం చేసి 4 నెలలు అయ్యింది..



జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో ఎంతో విలువైన ఇంటి స్థలం ఇచ్చి, నిర్మాణం కోసం డబ్బులిచ్చారు. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఇంటి కోసం చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇల్లు మంజూరైందని చెపితే నమ్మలేక పోయా. ఇల్లు పూర్తయి, గృహప్రవేశం చేసి 4 నెలలు అయింది.

– దేవనపల్లి వరలక్ష్మి,
జగనన్న కాలనీ, జగ్గయ్యపేట

సొంతింటి కల నెరవేరింది



గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మాకు ఇంటి స్థలం, ఇల్లు ఎవరూ ఇవ్వలేదు. గతంలో జన్మభూమి సభల్లో అనేకసార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. 15 ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న మాకు జగనన్న గూడు కల్పించారు. దీంతో సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. గృహప్రవేశం చేసి ఇప్పుడు జగనన్న కాలనీలోనే ఉంటున్నాను.

– గుజ్జం జానకీరత్నం,
జగనన్న కాలనీ, జగ్గయ్యపేట

సకాలంలో బిల్లులు..



నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న జగనన్న కాలనీ గృహాలకు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నాం. దశల వారీగా సిమెంట్, నిర్మాణాలకు అవసరమైన నీటి సదుపాయం సమకూరుస్తున్నాం. జగనన్న కాలనీల్లో చాలా చోట్ల విద్యుత్ లైన్లు ఏర్పాటుచేశాం. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. లక్ష్యాలను త్వరలోనే పూర్తి చేస్తాం.

– ఎస్‌పీఎస్.ప్రకాశరావు,
ఎఫ్ఏసీ హౌసింగ్ డీఈఈ

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. మహిళా రక్షణకు అనేక చట్టాలున్నాయన్నారు. పోక్సో, గృహ హింస చట్టాలు ప్రత్యేకంగా మహిళా రక్షణకు పని చేస్తున్నాయన్నారు. ఎంపీడీఓ జయచంద్ర, మహిళలు పాల్గొన్నారు.

15న హుండీ కానుకల లెక్కింపు

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈనెల 15వ తేదీన నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.నాగరాజు గురువారం తెలిపారు. 15న ఉదయం 8 గంటలకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను లెక్కిస్తామన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని భూచవరం వైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా గురువారం 104 ద్వారా వైద్య సేవలందించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కలిగిస్తున్నామన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా బీపీ, సుగర్ తదితర పరీక్షలతో పాటు కిశోర బాలికలకు పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. సూపర్‌వైజర్లు యలమందయ్య, వెంకట్రావ్, రమేష్‌బాబు, అలివేలమ్మ, సీహెచ్ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

నందిగామ: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఆ శాఖ విజయవాడ రూరల్ ఈఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందిగామ మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. 43 బృందాలు 2,947 సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న 299 మంది వినియోగదారులపై కేసులు నమోదు చేశారు.

కాలుష్య నివారణకు చర్యలు

ఆటోనగర్(జగ్గయ్యపేట): కర్మాగార యాజమాన్యాలు కాలుష్యాన్ని నివారించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ పార్కులోని ఇంటిగ్రీన్, సహస్ర కర్మాగారాలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యాలు పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్ని పూర్తిగా నివారించే చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు మనోహర్, రోశయ్య, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.


దిశ డీఎస్పీ విచారణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో దిశ డీఎస్పీ వీవీ నాయుడు గురువారం సాయంత్రం విచారణ చేపట్టారు. వివరాల్లోకెళితే మహారాష్ట్ర ముంబాయిలో కిడ్నాప్ అయిన పిల్లలకు సంబంధించిన కేసులో పట్టణంలో ఇద్దరు పిల్లల ఆచూకీ లభించిన విషయం విధితమే. ఈ క్రమంలో పెంచిన తల్లిదండ్రుల నుంచి డీఎస్పీ నాయుడు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ బీవీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

5న 'చలో ఢిల్లీ'

వత్సవాయి: మహా సంఘర్షణ కార్మిక, కర్షక ర్యాలీ సందర్భంగా ఏప్రిల్-5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌలురైతు సంఘ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు పిలుపునిచ్చారు. వత్సవాయిలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో ప్రజా సంఘాల మండల సదస్సు గురువారం నిర్వహించారు. కార్మికుల హక్కులను కాలరేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల రైతుల హక్కులను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని చెప్పారు.

వైఎస్సార్ బీమా అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: పెనుగంచిప్రోలు మండలం, అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ క్రమంలో వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షలను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు, కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మృతుడి భార్య సునీతకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఉదయభానుకు సునీత ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ డి.దానయ్య, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకే..
చెన్నారావుపాలెం(వీరులపాడు): వైఎస్సార్ బీమా పథకం బాధిత కుటుంబాలకు అండని సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు పేర్కొన్నారు. చెన్నారావుపాలెం గ్రామానికి చెందిన బోడిపల్లి బూషమ్మకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం ఆయన అందజేశారు.

వైభవంగా ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొలువై ఉన్న అంకమ్మ తల్లి, మద్దిరావమ్మ, పోతరాజు మారెమ్మ తల్లి శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం జరిగింది. ఉదయం 9.26 గంటలకు నాగలింగం రామకృష్ణశర్మ, శైవాగం, పవన్, కృష్ణచైతన్య శర్మలు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, సర్పంచ్ వేల్పుల సునీత, నాయకులు కాలవ వాసుదేవరావు, లగడపాటి నాగేశ్వరరావు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను రక్షించుకోవాలి


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్న వెంకటరమణ, భక్తులు

పెనుగంచిప్రోలు: పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాలని బలుసుపాడు గురుధామ్ వ్యవస్థాపకుడు గెంటేల వెంకటరమణ తెలిపారు. స్థానిక మునేరు పక్కన వేంచేసి ఉన్న శ్రీస్వయంభు శంభు లింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం, శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి నూతన ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. సనాతన ధర్మాలను పాటించటంతో పాటు ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలన్నారు. నూతన ఆలయాలు నిర్మించుకోవటం కంటే పాత దేవాలయాలను రక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆలయం నిర్మాణంలో భాగంగా రోజుకు ఒక రూపాయితో పాటు గుప్పెడు బియ్యం పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో కెడీసీసీ బ్యాంక్ మేనేజర్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల, గ్రామ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, కాకాని హరి, ఎంపీటీసీ సభ్యురాలు కాకాని స్రవంతి, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, వేగినేటి గోపాలకృష్ణమూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, కర్ల వెంకటనారాయణ, ఆలయ నిర్మాణ ట్రస్ట్ నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

నందిగామ: మండలంలోని రుద్రవరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ, సాయి శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలు రకాల హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు


గర్భాలయాన్ని తొలగిస్తున్న అధికారులు

జగ్గయ్యపేట: పట్టణంలోని కోదండ సీతారామాలయం(పెద్ద రామాలయం) పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గర్భాలయాన్ని గురువారం పూర్తిగా తొలగించారు. దాదాపు కొన్ని వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం కావటంతో రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో మూడు గంటల పాటు శ్రమించి నేల మట్టం చేశారు. రూ.1.50 కోట్ల వ్యయంతో కొద్ది రోజుల్లో భూమి పూజ పనులు చేపడతామని ఆలయ ఈఓ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

60 మందికి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్, చిన అవుటపల్లి వైద్య బృందంచే నిర్వహించిన వైద్య శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేసి, వారిలో 14 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ.నరసింహారాజు, గున్నం నారాయణరెడ్డి, కోశాధికారి పి.కృష్ణమూర్తి, క్లబ్ ప్రతినిధులు మహేష్, మోహన్‌బాబు,అమరనాథ్, బదరీనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలి



పెద్దాపురం(వీరులపాడు): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు విధిగా బలవర్ధక ఆహారం తీసుకునేలా కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం కేంద్రంలోని గుడ్లు, పౌష్టికాహారం తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మత గురువులకు సన్మానం



జగ్గయ్యపేటఅర్బన్: ఉత్తరప్రదేశ్‌లో ఆలిమ్, హాఫిజ్ కోర్సులు పూర్తిచేసుకుని వచ్చిన సందర్భంగా ముస్లిం నాయకులు షేక్ జుబేర్, రహంతుల్లా ఆధ్వర్యంలో ముస్లిం మత గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ మత గురువులను సన్మానించారు. అనంతరం 22వ వార్డు నాగమయ్య బజారుకు చెందిన అబిద్ సోదరి వివాహాన్ని పురస్కరించుకొని కృష్ణప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అమృతాహారం పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వాస్పత్రిలో ప్రతి నెల 9 వ తేదీన జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గర్భిణులు, బాలింతలకు అమృతాహారం అందజేశారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ వితరణతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ పాల్గొని అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కన్నమాల శామ్యూల్, కొత్తా పురుషోత్తం, తన్నీరు నాగేంద్ర, గోనుగుంట్ల ధనుంజయ, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాగర్ నీటి విడుదల

పెనుగంచిప్రోలు: చెరువు మాధవరం చెరువు నుంచి శుక్రవారం సాగర్ నీటిని విడుదల చేయనున్నట్లు ఎన్ఎస్పీ ఈఈ శ్రీనివాసన్ తెలిపారు. ఎన్ఎస్పీ అధికారులు రైతులతో కలిసి సాగర్ నీటి మట్టాన్ని పరిశీలించారు. పాలేటి దిగువ భాగంలో మహిళ మృతి చెందడంతో రెండు రోజులు నీటిని నిలిపివేశామన్నారు. మొక్కజొన్న పంటకు నీరు సంవృద్ధిగా అందిస్తామని చెప్పారు. డీఈ లక్ష్మీనారాయణ, జేఈ గోపాలరావు, గుంటుపల్లి వాసు, రైతులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల మూడో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుండే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ క్యూలైన్లతో పాటు పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడుతో పాటు మండలంలోని ముచ్చింతాల, వెంకటాపురం, గుమ్మడిదూర్రు, శివాపురం గ్రామాల నుంచి చిన్న దూడలు, గొర్రెలుతో బండ్లు కట్టటంతో పాటు సైకిళ్లకు, ఆటోలకు పార్టీ జెండాలు, ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు.
భక్తులకు రామ్‌కో సిమెంట్స్ వారు పులిహోరం పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం నెలకొంది.


పొంగళ్లతో వస్తున్న భక్తులు


ఆలయ ప్రాంగణంలో భక్తజనం

'మా బిడ్డకు అమ్మ ఒడి పథకం వస్తుంది'

గడప గడపకు మన ప్రభుత్వంలో ఆనందం వ్యక్తం చేసిన మహిళ


పరిటాలలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: అమ్మా మీ బిడ్డకు అమ్మ ఒడి పథకం వస్తుందా అని ఓ మహిళను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అడగ్గా ఆనందబాష్పాలు రాలుస్తూ ఆ మహిళ అయ్యా సీఎం జగనన్న పుణ్యమాని మా బిడ్డకు అమ్మ ఒడి పథకం వస్తుందని చెప్పారు. మండలంలోని పరిటాలలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాల కతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వమన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, నాయకులు మార్త శ్రీనివాసరావు, వెంపరాల ఆంజనేయులు, కర్ల రామకృష్ణ, శివనాగేశ్వరరావు, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, యద్దనపూడి విజయారావు, వేముల జీవరాజు, జిక్కుల నరసింహారావు, పి.కిషోర్, ఏ విజయ్, వేములు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, వెల్లంకి రామారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


రోడ్డు నిర్మాణ పనులకు శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

పెండ్యాల(కంచికచర్ల): గ్రామాలన్నీ అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పెండ్యాల గ్రామంలో బీసీ కాలనీలో 7వ వార్డులో మండల పరిషత్ నిధులు రూ.8.55 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. గతంలో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి ఈ రోడ్డుద్వారా భక్తులు వెళ్లేవారని అయితే రోడ్డుపై గోతులు పడటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు అంతర్గత రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే గ్రామంలో ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, నాయకులు పీర్‌సాహెబ్, ఏఎంసీ డైరెక్టర్ చాన్‌బహదూర్, నరసింహారావు, కొండలు, ఆదియ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణ పనుల పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: రహదారుల నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రామన్నపేట రోడ్డు, చందర్లపాడు రహదారుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా పలు ప్రధాన రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే పట్టణంలోని సీఎం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని, అదే తరహాలో రామన్నపేట రోడ్డు, చందర్లపాడు వెళ్లే రహదారులనూ విస్తరిస్తామని తెలిపారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం


జాతీయ రహదారిపై సేఫ్టీ పిల్లర్స్ ఏర్పాటు చేయిస్తున్న పోలీస్ సిబ్బంది

నందిగామ: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని ఎస్‌హెచ్ఓ సతీష్ పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేట, ఐతవరం ప్రాంతాల్లో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల నివారణలో భాగంగా ఆయా ప్రాంతాల్లో గురువారం నందిగామ పోలీసులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా అవసరమైన ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన రేడియం స్టిక్కర్స్, సేఫ్టీ పిల్లర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వాహన చోదకులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది ఉన్నారు.